క్లుప్తంగా

మోటార్లు తొలగించాలి

గండీడ్: చెరువుల్లో, కాల్వల్లో అక్రమంగా వేసిన మోటార్లను తొలగించాలని మత్స్యకార్మికులు, రైతులు వేడుకున్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి , వెన్నాచేడ్ గ్రామాలకు చెందిన మత్స్యకారులు తహసీల్దార్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. రెడ్డిపల్లి రెడ్డిచెరువు, మల్లయ్య చెరువుల్లో మోటార్లు వేసి నీటిని అక్రమంగా పొలాలకు వాడుతున్నారు. కొందరు చెరువు ఆయకట్టుకు సంబంధం లేకుండా నీటిని మోటార్ల ద్వారా పక్కకి మళ్లిస్తున్నారు. దీని కారణంగా చెరువులో నీరంతా పోయి ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. వారి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రెడ్డిపల్లి రెడ్డిచెరువు, మల్లయ్య చెరువుల వద్దకు చేరుకొని రైతులతో మాట్లారు. రైతులు మోటార్లు తప్పకుండా తొలగించాల్సిందేనని ఆదేశించారు.

బాదేపల్లి హైస్కూల్ వార్షికోత్సవం



జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలతో పాటు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు, హాల్‌టికెట్ల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, ఎంఈఓ మంజులాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ వార్షిక నివేదికను సభకు నివేదించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధ మహిళలకు చీరల పంపిణీ

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ గ్రామంలో 'ఆకలి బువ్వ సేవా సమితి' ఆధ్వర్యంలో రంజాన్ పండగను పురస్కరించుకొని ఉంధ్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోయిన్ మంగళవారం వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు.ఆ సేవా సమితి వ్యవస్థాపకుడు రాజేందర్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, నిరంజన్, రాజీవ్ గాంధీప్రసాద్, బాల్‌రాజు, మురళీ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

దేవరకద్ర: మండల కేంద్రంలోని 9 వ నెంబర్ రేషన్ షాపును మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య తనిఖీ చేశారు. షాపులో ఉన్న స్టాకు, రిజిష్టర్‌లను పరిశీలించారు. వినియోగ దారులకు సక్రమంగా సరుకులు అందించాలని సూచించారు. ప్రభుత్వం పేదల కోసం ఇచ్చే బియ్యం ప్రతి కార్డుదారుడికి అందేలా చూడాలని తెలిపారు. ఆర్‌ఐ శరత్ పాల్గొన్నారు.

'వసూళ్లపై దృష్టిపెట్టండి'

గండీడ్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీసుకున్న రుణాల వసూలుపై దృష్టి పెట్టాలని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌టీ రుణాల రికవరీ చేయడంలో నిర్లక్ష్యం వహించొవద్దని అన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్లు మమత, ప్రదీప్‌రెడ్డి, నర్సమ్మ, సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి, దశరథ్‌గౌడ్, దాంలనాయక్, చంద్రయ్య, జంగ్లవెంకటయ్య, అశోక్‌గౌడ్, బాలస్వామి, శ్రీహరి పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్ స్థలాన్ని కాపాడాలి

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామానికి చెందిన ముస్లిం శ్మశానవాటిక (ఖబ్రస్థాన్) స్థలాన్ని కాపాడాలని స్థానిక ముస్లిం మత పెద్దలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మండల కేంద్రంలో డీటీ సువర్ణకు మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాదర్, తదితరులు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 801లో గతంలో 1958లో గ్రామానికి చెందిన సైయాద్ ఆలీ అనే వ్యక్తి ఒక ఎకరా 28 గుంటల భూమిని శ్మశానానికి ఇచ్చారు. తాజాగా అతని వారసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

లేగదూడపై చిరుత దాడి

గండీడ్: మండలంలోని కొండాపూర్ గ్రామం శివారులోని లేగదూడపై చిరుత దాడి చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రాజకొండ గట్టు పొలాల దగ్గర చెన్నారం చంద్రయ్య పొలంవద్ద ఉన్న లేగదూడపై చిరుత దాడి చేయగా అది అక్కడికక్కడే మృతిచెందింది.

పీఈటీకి అభినందనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: న్యూఢిల్లీలో ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీలకు జిల్లా కేంద్రం రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న బి.పుష్ప ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో పీఈటీని హెచ్‌ఎం అంజిలిదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

- సమస్యలు లేకుండా చూడాలి
- ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించాలి
- కలెక్టర్ విజయేందిర బోయి



దేవరకద్రలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర: వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో పాటు ఇరిగేషన్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి ముగిసే వరకు ఎక్కడ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. భూగర్భజలాలు అడుగంటి పోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందా అని అధికారులతో చర్చించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి సలహాలు సూచనలివ్వాలని తెలిపారు. భూగర్భజలాలు ఇంకిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. వచ్చే సీజన్‌లో వరికి ప్రత్యామ్నయంగా ఆరు తడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. డోకూర్‌లో రైతు చంద్రశేఖర్‌రెడ్డి పొలంలో వేసిన వరి పంటను పరిశీలించారు. నీటి వనరులను బట్టి పంటలు వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వేసవి ఎండల వల్ల భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటి సామర్థ్యం తగ్గిపోయిందని ఆమె తెలిపారు. నష్ట పోయిన రైతుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏడీఏ యశ్వంత్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి రాజేంద్ర అగర్వాల్, ఏఈ కీర్తి, ఇరిగేషన్ ఏఈలు హరిందర్, కిషన్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నాక్‌లో గృహనిర్మాణ శాఖ ద్వారా శిక్షణపొందిన మేస్త్రీలకు సర్టిఫికెట్లు అందచేశారు. మేస్త్రీలు 5 లక్షల బడ్జెట్‌లో నాణ్యతగా ప్రభుత్వం రూపొందించిన డిజైన్ ప్రకారం లబ్దిదారులకు ఇళ్లు నిర్మించాలని అన్నారు. వారికి గృహ నిర్మాణ శాఖ ఐడెంటిటీ కార్డులు అంద చేయాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్ పాల్గొన్నారు.

బీసీలకు స్వర్ణయుగమని చెప్పుకోవడం సిగ్గుచేటు

- వారి సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: కేసీఆర్ పాలన బీసీలకు స్వర్ణయుగమని చెప్పుకోవడం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ విమర్శించారు, జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.20,69,588 కోట్ల బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం కేవలం 2శాతం అనగా కేటాయించిన రూ.41,484 కోట్లలో ఖర్చు చేసింది రూ.25,419 కోట్లు మాత్రమేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. 42 శాతం పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించే బాధ్యతను బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలపై ఉందన్నారు. ఈ బిల్లుకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్‌గౌడ్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, అజ్మత్‌అలీ, రాములుయాదవ్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందని కాంగ్రెస్ ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షులు బండి మల్లేష్ అన్నారు. అసెంబ్లీలో బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించడంపై కాంగ్రెస్ ఓబీసీసెల్ పట్టణ అధ్యక్షులు బండి మల్లేష్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సంచా కాల్చి సంబరాలు చేశారు. తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి ముదిరాజ్, పటేల్ రాకేష్, రాచాల మురళీ, ఆంజనేయులు, మల్లన్న టీం సభ్యులు పాల్గొన్నారు.

'ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీసీలకు ప్ర త్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్ కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సైతం ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లును ఆమోదించాలన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. రామచందర్, జి.మల్లికార్జున్, భానుప్రతాప్, శ్రీనివాసులు, రూపవతి, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీలకు 42 శాతం కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించడంపై బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మైత్రి యాదయ్య హర్షం వ్యక్తం చేశారు. బీసీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణచౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు.


బిల్లు ఆమోదంపై..

దేవరకద్ర: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపినందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు పాతబస్టాండ్‌లో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఆంజనేయులు, రాజు ఉన్నారు.

బీసీల విజయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానించడం బీసీల విజయమని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో జరిగిన బీసీ కులాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాధికారం కోసం ఎన్నో వేదికల ద్వారా బీసీలు నిర్విరామంగా పోరాటాలు చేస్తూనే వస్తున్నారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి ఏకగ్రీవ తీర్మానం హర్షనీయమన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి



మాట్లాడుతున్న రాములు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 48 గంటల ధర్నాలో భాగంగా సోమవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు పరచరాదని, పీఎంశ్రీ మొబైల్ సెంటర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయడంతో పాటు గ్రాటిటీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపాల్, ఖమర్‌అలీ, రామ్‌రెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, గౌసియా, ప్రభావతి, అనురాధ, సత్యమ్మ, పద్మ పాల్గొన్నారు.

కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



ఓఆర్‌ఎస్ పాకెట్లు అందిస్తున్న ఎంపీడీఓ దేవన్న

గండీడ్: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. పనులు జరుగుతున్న చోట వసతులు ఏలా ఉన్నాయని కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే చోట కూలీలకు నీటి సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని ఆయన సిబ్బందిని కోరారు. దీంతో పాటు వడదెబ్బ తగలకుండా నీడ కూడా కల్పించాలన్నారు. కూలీలకు క్రమం తప్పకుండా ఓఆర్‌ఎస్ పాకెట్లు ఇవ్వాలని, ఆయన కూలీలకు వాటిని పంపిణీ చేశారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరాములు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే దీక్ష మంగళవారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఎస్సీ వర్గీకరణను అమలుపరిచే వరకూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.ఎంఈఎఫ్ నాయకులు జె.బాలరాజు, పోలే బాలయ్య, కొండయ్య, కాన్సీరామ్, రామచందర్, నాగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎంఎస్‌ఎఫ్ పీయూ అధ్యక్షుడు మీసాల గణేష్ అన్నారు. సంఘం ఆధ్వర్యాన పీయూలో కొనసాగుతున్న నిరవధిక దీక్షల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపడితే మాదిగలకు తీవ్రఅన్యాయం జరుగుతుందన్నారు. ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్, పీయూ సంఘం విద్యార్థులు పూజిత, రమేష్, చైతన్య, రామాంజనేయులు, శివకుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

మహబూబ్‌నగర్ రూరల్: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఆమోదంతో అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్ట రూపంలో ఆమోదం పొందడం పట్ల ఎమ్మార్పీఎస్ (ఆర్‌ఆర్) ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాదిగ అమరవీరులు, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. టపాకాయలు కాల్చి డప్పులు కొట్టి స్వీట్లు పంపిణీ చేశారు.

వాలీబాల్ విజేత పడకల్

నవాబుపేట: మండలంలోని ఆదిబసవేశ్వర దేవాలయ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా రంగారెడ్డి జిల్లాకు చెందిన పడకల్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం విజేతలకు నిర్వాహకులు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మెదటి బహుమతి రూ.30 వేలు అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో నవాబుపేట జట్టు నిలవగా వీరికి రూ.20 వేలు అందించారు. జిల్లా స్థాయి భజన పోటీల్లో మొదటి బహుమతి గురుకుంట, ద్వితీయ బహుమతి మిడ్జిల్, తృతీయ బహుమతి తిమ్మయ్యపల్లి భజన బృందాలు అందుకున్నాయి. వీరికి సైతం బహుమతులు, నగదు పురస్కారాలు ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు ప్రతాప్, సత్యం, శ్రీను, పురుషోత్తం, రాములు, బాల్‌రాజ్ ఉన్నారు.

అర్హత కలిగినవారు ఓటరుగా నమోదు చేసుకోండి

అదనపు కలెక్టర్ మోహన్‌రావు



అధికారులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్ల: ఓటు హక్కు పొందడానికి అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జడ్చర్ల అసెంబ్లీ రాజకీయపార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో 18సంవత్సరాల వయస్సు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు వీలుగా నిర్ణీత ఫారాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం 06, 07, 08లను బీఎల్ఓలు సూపర్‌వైజర్లకు అందజేసిన చెక్‌లిస్ట్‌లను పరిశీలన చేయాలన్నారు.అదేవిదంగా ఆన్‌లైన్‌లో వచ్చి దరఖాస్తులను ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలన్నారు. ఈనెల 21లోగా వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు .ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓలను నియమించుకోవాలని తెలిపారు. ఓటు హక్కు నమోదుకు సంబంధించి ఫారం–6కు పుట్టినతేదీ ధ్రువీకరణకు సంబంధించి విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌కార్డును జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, డీటీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



బీటీ వేసే ముందు పిచికారి చేస్తున్న తారు

జడ్చర్ల: జడ్చర్ల సిగ్నల్‌గడ్డ పనులు ఆగుతూ.. సాగుతూ నత్తనడకన పనుల కొనసాగడంపై ఈనెల 10న 'సాక్షి' దినపత్రికలో 'అసంపూర్తి పనులతో అవస్థలు' అన్న శీర్షికన వచ్చిన వార్తా కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఎట్టకేలకు అసంపూర్తి పనులలో కదలికను తీసుకొచ్చారు. కంకర పోసి వదలేసిన పనులపై బీటీ వేసేందుకు కసరత్తును మొదలు పెట్టారు. అందులో భాగంగా మంగళవారం బీటీ వేసేందుకు పనులను చేపట్టారు. రోడ్డును శుభ్రపరిచి తారును పిచికారి చేశారు. మరి బీటీ వేసేందుకు మరెంత కాలం పడుతుందోనన్న ఆందోళనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే విదంగా తారును పిచికారి చేసి బీటీ వేసేందుకు నెలల సమయం తీసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి త్వరితగతని బీటీ పనులను పూర్తి చేరియాలని,అదేవిదంగా రైల్వే బ్రిడ్జి పనులను కూడా పూర్తి చేసి రాకపోకలకు వీలు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే పనులకు ఆటంకం



మాట్లాడుతన్న కాంగ్రెస్ నాయకులు

గండీడ్: గ్రామాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులకు ఇసుక అవసరముండగా దాన్ని తీసుకునేందుకు వెళ్తే బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి దర్జాగా ఇసుక దందా చేసిన నాయకులు నేడు అందుకు అవకాశం లేకపోవడంతో జీర్ణించుకోలేక ఫిర్యాదు చేశారని ఆరోపించారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

తప్పులుంటే సవరిస్తాం

దేవరకద్ర: ఓటర్ల జాబితాలో తప్పులుంటే సవరిస్తామని, దీనికి దరఖాస్తు చేసుకోవాలని ఈఆర్‌ఓ మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21 వరకు చివరి తేదీ అని, అప్పటిలోగా మృతిచెందిన వారి ఓట్ల తొలగింపు, తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదును చేయించుకోవాలని సూచించారు. అన్ని బూత్‌లలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, మీసేవ ద్వారా కూడా సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్ కృష్ణయ్య, జట్టి నర్సింహారెడ్డి, అంజిల్‌రెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

నవాబుపేట: ఎండాకాలం కావడంతో ఒంటిపూట బడుల నేపథ్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ జయరాం నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని యన్మన్‌గండ్ల, కూచూర్, మల్లారెడ్డిపల్లి, కారూర్ పాఠశాలలు, రుక్కంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

హెచ్‌డబ్ల్యూఓ ఉద్యోగాలు సాధించిన నలుగురు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు భాగ్యమ్మ, సునీత, ఎ.మోహన్, కె.ప్రసాద్ తాజాగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు (హెచ్‌డబ్ల్యూఓ) గా ఉద్యోగం సాధించారని డైరెక్టర్ కాడం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, వీరిని డీడీఎస్‌సీడీడీ కె.సుదర్శన్ అభినందించారు.

కేఐఓ కరాటే చాంపియన్‌షిప్‌కు దామోదర్

మహబూబ్‌నగర్ క్రీడలు: స్థానిక జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థి దామోదర్ ఈనెల 26 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే కేఐఓ (కియో) ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు జీకే మాస్టర్ షోటోకాన్ జిల్లాఅధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ శివకుమార్ తెలిపారు. దామోదర్ మెట్టగడ్డ డైట్ మైదానంలో కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. ఆయన ఎంపికపై జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ చీఫ్ జి.క్రిష్ణయ్య, సీనియర్ మాస్టర్లు రవి కుమార్, ఇలియాజ్ బిన్ సిద్దిఖీ, భీమ్‌సేన్‌రావు హర్షం వ్యక్తంచేశారు.

బోర్లు మరమ్మతు చేయిస్తాం



బోర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: వేసవికాలం దృష్టిలో ఉంచుకొని పాడయిన బోర్లు వెంటనే మరమ్మతులు చేయిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 6, 17వ వార్డుల్లో కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్లతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా బోర్లను ఆమె పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే బోర్లను పరిశీలించినట్లు తెలిపారు. కౌన్సిలర్లు చైతన్య, రమేష్, ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

జడ్చర్ల టౌన్: ఎన్‌ఎస్‌ఎస్ వల్ల జీవిత పరమావధి పరోపకారం అని తెలుస్తుందని పాలమూరు యూనివర్సిటీ(పీయూ) ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కె.ప్రవీణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. జీవితంలో వచ్చే క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొవాలో తెలుస్తుందన్నారు. శిబిరంలో 50 మంది వాలంటీర్లు రూ.3.5లక్షల వ్యయం అయ్యే పనులను చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.నర్మద, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.సదాశివయ్యతో పాటు పూర్వ వాలంటీర్లు రమాదేవి, సాయికుమార్, స్వామి, నారాయణ, రాహుల్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కో ఆర్డినేటర్ గార్డెన్‌లో మొక్కనాటి నీళ్లపోశారు.

విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్

నవాబుపేట: చలో హైదరాబాద్ పిలుపుతో హైదరాబాద్ తరలివెళ్లేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ సురేష్ తెలిపారు. మంగళవారం మండలానికి చెందిన విద్యార్థి విభాగం మండల నాయకులు మహేష్, ఫైజుల్లా షరీఫ్, ఇర్ఫాన్ అరెస్టుచేసి సొంత పూచీకత్తుపై విడదల చేసినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి ధ్యాన ఉత్సవాలు

నవాబుపేట: రాంచంద్రమిషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు ధ్యానఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజుగౌడ్, చిగుళ్ళపల్లి నర్సింహులు, వెంకటేశ్వరప్పలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయం ముందు రోజు సాయంత్రం 5గటంల నుంచి 7.30 గంటల వరకు ధ్యానోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు.